### ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు.. ఆరంభం కాని కొనుగోళ్లు

అకాల వర్షం వెంటాడుతున్న కారణంగా రైతులు ఒత్తిడి మేరకు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు, సొసైటీ చైర్మన్లతో కలిసి ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ కూడా ధాన్యం కాంటా ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీనిపై అధికారులను సంప్రదించగా.. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అలాట్‌మెంట్ (కేటాయింపు) రాలేదని చెబుతున్నారు. ధాన్యం కాంటా చేయకపోతే కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రచార ఆర్భాటం తప్ప, రైతులను ఆదుకోవాలనే తపన ప్రభుత్వానికి లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


నవీపేట మండలం యంచలో ధర్నా చేస్తున్న రైతులు

కేంద్రాల్లోనే ధాన్యం



### దళారులకే అమ్మిన

కొనుగోలు కేంద్రం లేక సొసైటీలో ఇంకా కేంద్రం పెట్టలేదు. ఒకపక్కన ఆనలు కురవట్టే. కోసిన వడ్లు ఆరబెట్టడానికి అవకాశం లేదు. సొసైటీ ద్వారా కాంటా వేస్తే నేను దళారులకు ధాన్యం అమ్మే వాన్ని కాను. నాకున్న ఎకరమున్నర పొలంలో సన్నరకం వడ్లు పండించగా పచ్చి ధాన్యాన్ని క్వింటాలుకు 2,250 రూపాలకు అమ్మిన.

- బానోత్ బాబు, రైతు, మల్కాపూర్ తండా



### బోనస్ వస్తదని నమ్మకంలేదు..

నాకున్న రెండున్నర ఎకరాల పొలంలో సన్నరకం వరిని పండించాను. రూ.500 బోనస్ అస్తదనే నమ్మకం లేకనే ప్రైవేట్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2,200 ధరకు అమ్మిన. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకుంటలేదు. రైతు బంధు ఇవ్వలేదు, బోనస్ కూడా అస్తదో లేదో కూడా తెలియదు. తప్పనిసరి పరిస్థితిలో దళారులకు అమ్మిన.

- మాలోత్ మధు, రైతు, మల్కాపూర్ తండా


హైకోర్టు ఉత్తర్వు కాపీని డీసీవో రామ్మోహన్‌కు అందజేస్తున్న బస్వాపూర్ విండో మాజీ చైర్మన్ స్వామి, డైరెక్టర్లు

# న్యాయం గెలిచింది

కుటిల రాజకీయం ఓడింది..

- హైకోర్టు తీర్పుతో బస్వాపూర్ సొసైటీకి ఊపిరి
- ప్రజాస్వామ్య విలువలకు కాంగ్రెస్ నేతల తిలోదకాలు
- అడ్డదారిలో అధికారం చేజిక్కించుకునేందుకు యత్నాలు
- జిల్లాలో యథేచ్ఛగా అధికార దుర్వినియోగం..

నిజామాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అడ్డదారిలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు యత్నించిన నాయకులకు ఎదురుదెబ్బ తగిలింది. భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ సొసైటీ విషయంలో ఎలాగైనా పంతం నెగ్గించుకునేందుకు పాకులాడి హైకోర్టు ముందు బొక్కా బోర్లపడాల్సిన పరిస్థితి ఎదురైంది. కోర్టు వెలువరించిన తీర్పు ..కాంగ్రెస్ నాయకులకు చెంపపెట్టులా మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి కుటిల రాజకీయాలకు తెరలేపింది.ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీకి చెందిన నాయకులు ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చి ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. పార్టీలో చేరికల నుంచి సహకార సంఘాల్లోనూ మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారు. ఇందుకు భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ సొసైటీ అంశమే ఉదాహరణగా నిలుస్తున్నది.

**దొడ్డిదారిన విభజన ఉత్తర్వులు**

బస్వాపూర్ సొసైటీ విషయంలో ఎలాగైనా పంతం నెగ్గించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్లు పావులు కదిపారు. సొసైటీ చైర్మన్‌పై పాలకవర్గ సభ్యులందరూ ఈ ఏడాది ఏప్రిల్ 4న అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గించుకున్నారు. ఫలితాలను వెల్లడించేలోపే సహకార శాఖకు చెందిన అధికారులను ప్రభావితం చేసి బస్వాపూర్ సొసైటీని రెండు ముక్కలు చేస్తున్నట్లు దొడ్డి దారిలో విభజన ఉత్తర్వులు తీసుకువచ్చారు. దీంతో పాత బస్వాపూర్ సొసైటీ పాలకవర్గం సాంకేతికంగా సుప్తావస్థలోకి వెళ్లింది. గెజిట్ నోటిఫికేషన్ జారీ కాకుండా బస్వాపూర్, కాచాపూర్ సొసైటీల మనుగడ అసాధ్యమని సహకార చట్టంలోని పలు సెక్షన్‌లు స్పష్టంగా చెబుతున్నా.. తమ ఆధిపత్యం నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ కీలక నేత కుటిల రాజకీయాలకు పాల్పడ్డాడు. రెండుగా ఏర్పడిన బస్వాపూర్, కాచాపూర్ సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించేలా ప్రభుత్వం నుంచి మరో ఉత్తర్వును జారీ చేయించారు. పాలకవర్గం చేత అవిశ్వాసంలో పదవిని కోల్పోయిన వ్యక్తిని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించి కాంగ్రెస్ నేతలు తమ పైశాచికత్వాన్ని చాటుకున్నారు.

**కాంగ్రెస్ నేతలకు షాక్**

రాజకీయంగా బీఆర్‌ఎస్ పార్టీని ఎదుర్కోలేక.. కుట్రలతో పెత్తనం చెలాయించేందుకు కాంగ్రెస్ ముఖ్యనాయకుడొకరు వేసిన ఎత్తుగడ బోల్తా కొట్టింది. పర్సన్ ఇన్‌చార్జీల నియామకాన్ని సవాల్ చేస్తూ బస్వాపూర్ పాలకవర్గ సభ్యులు హైకోర్టును ఆశ్రయించగా సుదీర్ఘ వాదనల తర్వాత న్యాయమూర్తి స్పష్టమైన తీర్పును వెలువరించారు. ఈ తీర్పుతో కాంగ్రెస్ నేతలకు గట్టి షాక్ తగిలినట్లయ్యింది. పర్సన్ ఇన్‌చార్జీల నియామకం రద్దు, బస్వాపూర్ సొసైటీ విభజన చెల్లదంటూ హైకోర్టు స్పష్టం చేసింది. గెజిట్ నోటిఫికేషన్ లేకుండా సొసైటీ విభజనను గుర్తించలేమంటూ చెప్పడంతో, తిరిగి పాత బస్వాపూర్ విండో పాలకవర్గానికి సర్వ అధికారాలు సమకూరనున్నాయి. చైర్మన్ పదవిని కోల్పోయిన వ్యక్తి స్థానంలో మరో సభ్యుడికి చైర్మన్‌గా అవకాశం దక్కనున్నది. సొసైటీ విషయంలో అతి జోక్యం చేసుకుని న్యాయబద్ధమైన ప్రక్రియలో బీఆర్‌ఎస్ నేతల ముందు కాంగ్రెస్ వృద్ధ నేత ఓడిపోవాల్సిన పరిస్థితి వచ్చింది.

**అధికార దుర్వినియోగం**

బస్వాపూర్ సొసైటీ పాలకవర్గ విషయంలో సహకార శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ నేతలకు వంతపాడుతూ, వారి చెప్పిన ప్రతి అంశాన్నీ ఉత్తర్వు రూపంలో అమలుచేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి కాంగ్రెస్ నేతల కు వంత పాడారు. రాత్రికి రాత్రే ఉత్తర్వులను తయారు చేయ డం, వాటిని క్షణాల్లో అమలు చేశారని పాలకవర్గసభ్యులు ఆరోపిస్తున్నారు. తమ వాదన వినకుండా ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడుతున్నారు. హైకోర్టు తీర్పు.. బస్వాపూర్ సొసైటీకి ఊపిరి పోయగా.. అధికార దుర్వినియోగానికి పాల్పడిన సహకార శాఖ అధికారులు, కాంగ్రెస్ నేతలకు చెంపపెట్టులాంటిదని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు.

## హైకోర్టు ఆదేశాలను అమలుచేయాలి

భిక్కనూరు, అక్టోబర్ 25: హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలుచేయాలని కోరుతూ బస్వాపూర్ సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ మద్దిస్వామి, మాజీ పాలక వర్గ సభ్యులు.. డీసీవో రామ్మోహన్‌ను కోరారు. ఈ మేరకు వారు కోర్టు వెలువరించిన ఉత్తర్వుల కాపీని శుక్రవారం ఆయనకు అందజేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశానుసారం పాత పాలకవర్గాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. పాలకవర్గ మాజీ డైరెక్టర్లు పాతూరి రాజు,సుధాకర్ రెడ్డి, రాంరెడ్డి, నర్సింహులు, కిష్టారెడ్డి ఉన్నారు.

# 'ధాన్యం'పై ధ్యాసేది..

- ప్రారంభోత్సవాలతో సరి
- కొనుగోళ్లు చేసేవారేరి?
- ప్రచార ఆర్భాటం.. పట్టించుకోని యంత్రాంగం
- మద్దతు ధరకు మంగళం.. 'బోనస్'పై సర్కారు నిర్లక్ష్యం
- దళారులకు పంట విక్రయం
- నష్టపోతున్న రైతాంగం

**ఉమ్మడి జిల్లాలో** ధాన్యం కొనుగోళ్లపై సందిగ్ధం నెలకొన్నది. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, ధాన్యం సేకరిస్తామంటూ ప్రభుత్వం చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉన్నది. పంట కోతలు మొదలైనా ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు, అధికారులు కొనుగోలు కేంద్రాలను ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్నా.. కాంటా చేసేవారు దిక్కులేరు. పేరుకే కేంద్రాలను ఏర్పాటు చేసినా, కొనుగోళ్లను ఇంకా ప్రారంభించలేదు. దీంతో రైతులు దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసిపోతుందని తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. మద్దతు ధర, వరికి బోనస్ దేవుడెరుగు.. రోజుకో గ్రామంలో తూతూ మంత్రంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రభుత్వం తమను మభ్యపెడుతుందని రైతాంగం అసహనం వ్యక్తంచేస్తున్నది.

-సారంగాపూర్/ బాన్సువాడ, అక్టోబర్ 24

**ధాన్యం దళారుల పాలు..**

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధరతోపాటు వరికి బోనస్ దక్కుతుందని ఆశించిన అన్నదాతకు మొండి 'చెయ్యి' చూపింది. ఒకవైపు వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, నిత్యం ఆకాశం మేఘావృతమై ఉండడంతో చేతికొచ్చిన పంట ఏమవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లో కాంటా ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో రైతులు పండించిన ధాన్యం దళారులు, వ్యాపారుల పాలవుతున్నది. కల్లాల వద్దే ధాన్యం కాంటా వేసి, తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలతోపాటు నిజామాబాద్ జిల్లాలోని వర్ని, చందూర్, రుద్రూర్ , మోస్రా, కోటగిరి తదితర ప్రాంతాల్లో దసరా పండుగ నుంచే వరి కోతలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో జాప్యం నెలకొనడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. దీంతో కొంతమంది రైతులు పక్కరాష్ట్రాలైన కర్ణాటక, ఏపీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత ఎక్కువగా ధాన్యం పండించిన నియోజకవర్గంగా పేరున్న బాన్సువాడ రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితులను రావడం బాధాకరమైన అంశం.


బాన్సువాడ మండలంలోని కొల్లూర్, సోమేశ్వర్ గ్రామాల శివారులో ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్న రైతులు

**గత ప్రభుత్వ హయాంలో రైతన్న ముఖంలో సంతోషం**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సకాలంలో కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి, వెంటనే ఖాతాల్లో డబ్బులు జమచేయడంతో రైతుల ముఖాల్లో సంతోషం చూసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మద్దతు ధరతోపాటు వరికి బోనస్ పేరిట కాలయాపన చేస్తుందని, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట సాగు సమయంలో గత ప్రభుత్వం పెట్టుబడి సాయమందించి చేయూతనివ్వగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించకపోవడంతో అన్నదాతలు అప్పులు తెచ్చుకున్నారు. వరి కోతలు ప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా ఇంతవరకు పంట పెట్టుబడి సాయాన్ని అందించలేదు. అంతేగాక సన్న రకం ధాన్యం పండిస్తే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలుకునోచుకోవడం లేదు. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించడంలో అనేక అవస్థలు పడుతున్నారు.

**వెంటాడుతున్న అకాల వర్షం.. రైతన్నకు నష్టం**

నిజామాబాద్ రూరల్ మండలంలోని ముత్తకుంట, మాధవ్‌నగర్, పాల్దా సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ముందుగానే వరినాట్లు వేయడంతో కోతలు కూడా ముందస్తుగానే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేయడం, మరోపక్కన అకాల వర్షం వెంటాడుతున్న ఈ పరిస్థితిలో ధాన్యాన్ని క్వింటాలుకు రూ.2,200 నుంచి రూ.2,300 వరకు దళారులకు విక్రయిస్తున్నారు. చాలా మంది రైతులు ఈ ధరలకే విక్రయిస్తున్నారు. కొంతమంది రైతులు మాత్రం రోడ్లపైన ధాన్యం ఆరబోసి ఎండినతర్వాత దళారులకు విక్రయిస్తుండగా రూ.2,400 నుంచి రూ.2,600 వరకు ధాన్యంలో ఉన్న తేమ శాతాన్ని బట్టి చెల్లిస్తున్నారు. కొంతమంది రైతులు మాత్రం మద్దతు ధర పొందుతున్నప్పటికీ ప్రైవేట్‌లో అమ్ముకుంటుండడంతో ప్రభుత్వం చెల్లించే బోనస్ రూ.500 కోల్పోయే పరిస్థితి ఏర్పడుతున్నది.

# రైతుల రాస్తారోకో..

- నాగిరెడ్డిపేటలో అఖిలపక్షం అధ్వర్యంలో ఆందోళన
- నవీపేట మండలం యంచవద్ద అన్నదాతల ధర్నా


నాగిరెడ్డిపేటలో రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు, రైతులను పక్కకు తోసేస్తున్న పోలీసు

నాగిరెడ్డిపేట/నవీపేట, అక్టోబర్ 25: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభించాలని రైతులు రోడ్డెక్కారు. నాగిరెడ్డిపేటలో శుక్రవారం అఖిలపక్షం నాయకులు రైతులతో కలిసి బోధన్, హైదరాబాద్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్ మాట్లాడారు. నెల రోజులుగా రైతులు ధాన్యం రాశుల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. అకాల వర్షాలతో ఎండిన వడ్లు తిరిగి తడిసిపోతున్నాయని తెలిపారు. కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పటికీ కాంటాలను ప్రారంభించ లేదన్నారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను బలవంతంగా బయటికి తీసుకువచ్చారు. అనంతరం అఖిలపక్షం నాయకులు ర్యాలీగా తహసీల్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోతే..వేల మంది రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. రాస్తారోకో బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ, దుర్గారెడ్డి, మల్లేశం, వంశీగౌడ్, భాజపా ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు దేవిసింగ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ధర్నా**

నవీపేట మండలంలోని నాగేపూర్ సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ యంచ బాసర రహదారి పక్కన రైతుల ధర్నా నిర్వహించారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదినెలలవుతున్నా రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలుచేయడంలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతులు వంజరీ రాజేశ్వర్, లాలు, మాజీ సర్పంచ్ లహరి ప్రవీణ్, నాగరావు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే 'బాల్కొండ' అభివృద్ధి

- గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను పూర్తి చేయండి
- అభివృద్ధి పనుల ప్రొసీడింగ్‌లను రద్దుచేయడం సరికాదు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఏర్గట్ల, భీమ్‌గల్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే


తాళ్లరాంపూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఏర్గట్ల/ భీమ్‌గల్, అక్టోబర్ 25 : కేసీఆర్ పాలనలో తాను మంత్రిగా చేపట్టిన అభివృద్ధి పనులు మాత్రమే గ్రామాల్లో దర్శనమిస్తున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏర్గట్ల, భీమ్‌గల్ మంలాల్లో పర్యటించారు. ఏర్గట్లలో షాదీఖాన, తాళ్లరాంపూర్, దోంచందలో పంచాయతీ భవనాలనుప్రారంభించారు. భీమ్‌గల్ మండల కేంద్రంతోపాటు మండలంలోని సంతోష్‌నగర్, సుదర్శన్‌నగర్ తండాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో తాను నిధులు మంజూరు చేసి వీడీసీ, పార్టీ నాయకులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసినట్లు తెలిపారు. ప్రొసీడింగ్ కాపీలు అప్పటి ప్రభుత్వ జీవో ద్వారా వచ్చాయని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి ముఖ్యమని అన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను రద్దుచేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. తాను మంజూరు చేసిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి తన ఖాతాల్లో వేసుకోవాలని చూస్తోందన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వానికి పేరు వచ్చినా పర్వలేదని, కానీ అభివృద్ధి పనులను మాత్రం ఆపవద్దని కోరారు. ఏర్గట్ల నుంచి మెట్‌పల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న తీగల వాగు బ్రిడ్జి, తాళ్లరాంపూర్ నుంచి కొండాపూర్, దోంచంద నుంచి తడ్‌పాకల్‌కు రోడ్డు పనులను వెంటనే చేపట్టాలన్నారు.భీమ్‌గల్‌లో రూ.50 లక్షలతో బంజారా భవనంకేసీఆర్ హయాంలోనే తండాలకు మహర్దశ వచ్చిందని వేముల తెలిపారు. కేసీఆర్ సహకారంతో భీమ్‌గల్ మండలంలోని సుదర్శన్‌నగర్, సంతోష్‌నగర్ తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గానికి ఒక బంజారా భవనం కావాలన్న బంజారాల కోరిక మేరకు కేసీఆర్ సహకారంతో రూ. 50 లక్షలతో భీమ్‌గల్‌లో బంజారా భవన నిర్మాణ పనులు పూర్తిచేశామన్నారు. ఈ భవనానికి ప్రహరీ నిర్మాణానికి సీడీపీ నిధుల నుంచి రూ.17 లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఏర్గట్ల మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు జైనుద్దీ న్ తదితరులు పాల్గొన్నారు.

# సోయా వాపస్‌పై రైతుల ఆగ్రహం

హెగ్డోలి సహకార సంఘం వద్ద ఆందోళన

పోతంగల్, అక్టోబర్ 25 : విక్రయించిన సోయాను వాపస్ చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ మండలంలోని హెగ్డోలి సహకార సంఘం వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సోయా కొనుగోలు చేసి ఐదు రోజుల తరువాత సగం ధాన్యం వాపసు వచ్చిందని, ధాన్యం బాగోలేదని నిర్వాహకులు చెబుతున్నారని మండిపడ్డారు. కొనుగోలు చేసిన ధాన్యం బాగోలేదని వాపసు పంపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మొత్తం ధాన్యాన్ని అధికారులు బేషరతుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.


హెగ్డోలి సహకార సంఘం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు